రాచపాలెం దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

పడిపోతున్న భూగర్భజలాలు

3.89 మీటర్ల లోతుకు జలమట్టం

ఎండివాడుతున్న వేరుశనగ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వర్షాభావ పరిస్థితులు నెలకొన్న తరుణంలో అనంతపురం జిల్లాలో భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోతున్నాయి. అనంతపురం జిల్లాలో 3.89 మీటర్లు లోతుకు నీటిమట్టం పడిపోయింది. ఈశాన్య రుతుపవనాల సమయంలోనూ వర్షాల్లేకపోవడంతో రబీ సాగుపైనా ఈ ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. నైరుతి రుతుపవనాల్లో వర్షాభావం నెలకొంది. ఇప్పుడు ఈశాన్య రుతుపవనాల సమయంలోనూ వర్షాల్లేవు. జిల్లాలో ఈ నెలాఖరు దాటితే వర్షాలు పడటం సాధారణంగానే తక్కువ. ఇప్పటికే మూడవ వారం వచ్చినా వాన రాకపోవడంతో రాబోయే రోజుల్లో వర్షాలు పడే అవకాశాలు చాలా తక్కువ. దీంతో భూగర్భజలాలు పడిపోతున్నాయి.

3.89 మీటర్లలోతుకు పడిపోయిన భూగర్భ జలాలు

గతేడాడితో పోలిస్తే ఈసారి భూగర్భజలాలు ఇప్పటికే 3.89 మీటర్లు పడిపోయాయి. వచ్చే వేసవి నాటికి మరింత తగ్గిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వర్షాలు సానుకూలంగా లేవు. అనంతపురం జిల్లా పరిధిలో ఇప్పటి వరకు 399 మిల్లీమీటర్లు వర్షపాతం కురవాల్సుండగా 253 మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదయింది. సాధారణం కంటే 36 శాతం వర్షపాతం లోటుంది. ఇక సత్యసాయి జిల్లా పరిధిలో 446 మిల్లీమీటర్లకుగానూ 298 మిల్లీమీటర్లు నమోదయింది. రెండు జిల్లాల్లో కలిపి సుమారు 45 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో రెండు జిల్లాల పరిధిలో భూగర్భ జలాలు అనేక ప్రాంతాల్లో గరిష్ఠంగా పడిపోతున్నాయి. అనంతపురం జిల్లా పరిధిలో రాయదుర్గంలో ఈ ఏడాది ఇప్పటి వరకు గరిష్ఠంగా 9.41 మీటర్ల నీటిమట్టం పడిపోయింది. కణేకల్ 8.85 మీటర్లు, కంబదూరు మండలంలో 6.27, బొమ్మనహాళ్ 5.69, బుక్కరాయసముద్రంలో 4.83 మీటర్లు లోతుకు పడిపోయాయి. బెళుగుప్ప, శెట్టూరు మండలం మినహా తక్కిన అన్ని మండలాల్లో మీటరు కంటే అధికంగా నీటిమట్టం పడిపోయింది. సత్యసాయి జిల్లాలో గరిష్ఠంగా గోరంట్ల మండలంలో 16.91 మీటర్లు పడిపోయాయి. గోరంట్ల మండలంలో 14.85 మీటర్లు, కొత్తచెరువు మండలంలో 10.60, సోమందేపల్లి 9.55, చిలమత్తూరు 9.94, పరిగి 9.22 మీటర్లు పడిపోయాయి. నల్లచెరువు 8.56 మీటర్లు ఇలా ఈ జిల్లాలో ప్రతి మండలంలోనూ నీటిమట్టం పడిపోవడం గమనార్హం.

రబీ సాగుపై ప్రభావం

అక్టోబరులోనూ వర్షాభావానికి తోడు భూగర్భ జలాలు పడిపోతుండటంతో రబీసాగు ప్రశ్నార్థకంగా మారనుంది. రెండు లక్షల ఎకరాలకుపైగా రబీలో పంటలు సాగవుతాయి. నల్లరేగడి నేలల్లో పత్తి, మిరప పంటలు సాగవుతాయి. ఇప్పటికే వేసిన పంటలు ఎండవాడుతున్నాయి. భూగర్భ జలాలు పడిపోతే బోరుబావుల్లోనూ నీటిమట్టం పడిపోయి సాగు ప్రశ్నార్థమవనుంది.

సాగునీరిచ్చి రైతులను ఆదుకోవాలి

సిపిఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

ప్రజాశక్తి-ఉరవకొండ

డిసెంబర్ ఆఖరి వరకూ సాగునీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం విడపనకల్లు మండల పరిధిలోని కరకముక్కల, పాల్తూరు, హావలిగి, విడపనకల్ గ్రామాల్లో కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఎల్సి, జిబిసి, హంద్రీనీవా కాలువల కింద సుమారు లక్ష ఎకరాలకుపైగా మిర్చి, పత్తి, వేరుశెనగ, జొన్న, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేశారన్నారు ఎకరాకు మిరపకు రూ.30 నుంచి రూ.80 వేలు పెట్టుబడి పెట్టారన్నారు. కౌలు రైతులు పెట్టుబడితోపాటు రూ.20 నుంచి రూ.50 వేల వరకూ ముందస్తు కౌలు చెల్లించి పంటలు సాగు చేశారన్నారు. ఈ సయమంలో అధికారులు తుంగభద్రలో నీళ్ల లేనందున ఈసారి పంటలకు సాగునీరు ఇవ్వలేమని జూలైలో ఆరుతడి పంటలకు మాత్రమే సాగునీరు ఇవ్వగలమని ప్రకటించడం బాధాకరమన్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి, కౌలు చెల్లించి పూత, కాయ దశలో ఉన్న మిర్చి పంటను ఏ విధంగా కాపాడుకోవాలో రైతాంగం దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతోందన్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు కనీసం రైతులకు భరోసా ఇచ్చే పరిస్థితిలో లేరన్నారు. జిల్లాలో ఆగస్టు,సెప్టెంబర్ నెలల్లో 19 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే వారిలో 12 మంది కౌలు రైతులే ఉన్నారన్నారు. అప్పుల భారం పెరిగిందని ప్రభుత్వం పంటలు పూర్తయ్యేంత వరకూ ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించి సాగునీరు ఇచ్చి రైతాంగానికి ధైర్యాన్ని భరోసా ఇవ్వాడంతో పాటు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఖరీఫ్‌లో వేసిన మెట్ట పంటలు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షాభావం చేత పంట దక్కే పరిస్థితి లేదన్నారు. ఈ సమయంలో మెట్ట రైతులకు ఎకరాకు రూ.50 వేల పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యుత్ కోతలు లేకుండా 9 గంటలు నాణ్యమైన కరెంటు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం నాయకులు నాగరాజు, రామాంజనేయులు, కృష్ణారెడ్డి, ఆర్‌వి.నాయుడు, కస్తూరిరెడ్డి, చంద్రశేఖర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ చేస్తున్న కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాలరంగయ్య, నాయకులు

అలాగే ఉరవకొండలో కూడా సిపిఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టినట్లు మండల కన్వీనర్ మధుసూదన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా లక్షలాది ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేశారన్నారు. కావున ఆయా పంటలను కాపాడుకునేందుకు హంద్రీనీవా, హెచ్ఎల్సి కెనాల్ ద్వారా డిసెంబర్ 30వ తేదీ వరకూ సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సీనప్ప,వెంకటేశులు,మహేష్,సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

మురుగు కుంపట్లుగా 'పురం' చెరువులు

మురికి కుంపటిని తలపిస్తున్న కొట్నూరు చెరువు

చెత్తా చెదారంతో కలుషితమవుతున్న నీరు

అధికారులు..గుత్తేదారులకు కాసుల వర్షం కురిపిస్తున్న కాలువలు

పట్టించుకోని మున్సిపల్, నీటిపారుదల శాఖ అధికారులు

అప్పట్లో ప్రజల కోసం తవ్వించిన చెరువులు నేటికీ ప్రజలకు జీవనాధరంగా ఉన్నాయి. అలాంటి చెరువులు నేడు మున్సిపల్ అధికారులకు, గుత్తేదారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. పట్టణంలో ఉన్నా నీటి పారుదల శాఖ కాలువలకు సిమెంట్ పూసి కోట్లాదిరూపాయలు కొల్లగొట్టడమే కాకుండా ఆ కాలువలోని మురుగు తీయడానికి ఏటా లక్షల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. అయినప్పటికి కాలువలు శుభ్రం కావటం లేదు. చెరువులు...కాలువల సమీప ప్రాంత ప్రజల కష్టాలు తీరడం లేదు. నిత్యం పట్టణ ప్రజలు కాలువలు, చెరువుల నుంచి వచ్చే దుర్వాసనను భరించడమే కాకుండా...దోమల కాటుకు గురవుతూ ఆసుత్రుల పాలవుతున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల వ్యాప్తంగా ఉన్న పరిశ్రమలు వాయు కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. జనానికి నీటి వనరులుగా ఉండాల్సిన చెరువులను మున్సిపల్ అధికారులు మురుగుకూపాలుగా మార్చారు. దీంతో జల, వాయు కాలుష్యంతో ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారింది. పట్టణంలో ఉన్న చెరువులన్నీ మురుగుముప్పులో పడ్డాయి. పట్టణంతో పాటు పెనుకొండ డివిజన్ వ్యాప్తంగా ఉన్నా దాదాపు అన్ని అన్ని చెరువులు నాడు ఈ ప్రాంతాన్ని పరిపాలించిన శ్రీకృష్ణదేవారాయలు తవ్వించారు. ప్రజా సంక్షేమం కోసం తవ్వించిన చెరువులు నేడు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. హిందూపురం పట్టణ పరిధిలో ఉన్న కొట్నూరు, శ్రీకంఠాపురం, సురప్పకుంట, సూగూరు చెరువులు వేలాది ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. ఈ చెరువుల కింద గతంలో దాదాపు 8వేల ఎకరాలకు పైగా సాగు జరిగేది. కాలక్రమేణా చెరువులకు నీరు సక్రమంగా రాకపోవడంతో నీరు లేకపోవడంతో వ్యవసాయం కనుమరుగైంది. పట్టణంలో భూగర్భ జలాలు ఇంకిపోకుండా చెరువుకు వచ్చిన నీటిని అధికారులు అలానే ఉంచేవారు. గత ఏడాది విస్తారంగా కురిసిన వర్షాలకు అన్ని చెరువులు పూర్తి స్థాయిలో నిండాయి. ఈ ఏడాది కూడా భూగర్భ జలాల పెంపునకు నీరు అలానే ఉంచారు. అయితే ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో కొట్నూరు, సురప్పకుంట, శ్రీకంఠపురం చెరువులలో ఆక్రమణలు పెరిగాయి. దాంతో పాటు చెరువులో వ్యర్థాలు వేయడం పెరిగింది. ఇంటి నిర్మాణ మిగిలిన సామగ్రి, ఆసుపత్రిలో రోగులకు సంబంధించిన బెడ్లు, మంచాలు, కోళ్ల, మాంస వ్యర్థాలను వేసి నీటిని కలుషితం చేస్తున్నారు. కొందరు లెట్రిన్ గుంతలు తవ్వితే ఖర్చు అని చెప్పి చెరువు కాలువకు నేరుగా లెట్రిన్ పైప్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మున్సిపల్ అధికారుల అనాలోచిత చర్యల కారణంగా చెరువుల జలాలు కలుషితం అవుతున్నాయి. పెన్నాకుద్వతి ప్రాజెక్టు నుంచి, సురప్పకుంట నుంచి కోట్నురు చెరువుకు అనుసందానంగా నీటి పారుదల కాలువలను మురుగు కాలువలుగా మార్చి చెరువులోకి వెళ్లే విధంగా అనుసంధానం చేశారు. ఇలా చేయడం వల్ల గత సంవత్సరం కురిసిన వర్షాలకు చెరువులు నిండి కాలువలు పొంగి పొర్లి నీరు కాలనీల్లోకి రోడ్లపైకి వచ్చి లోతట్టు ప్రాంతాలు నీటితో మునిగాయి. వీటితో పాటు శ్రీకంతాపురం, సూగూరు చెరువులకు అనుసందానంగా మురుగు కాలువలను నిర్మాణం చేశారు. ఇంత చేస్తున్నప్పటికి నీటి పారుదల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఎప్పుడైన ఒకసారి మున్సిపల్ శాఖ వారికి నోటీసు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారే తప్ప చర్యలు మాత్రం చేపట్టడం లేదు. ప్రస్తుతం హిందూపురం చుట్టు ఉన్నా చెరువులన్నీ మురుగు నీటితో నిండి దుర్వాసన వెదజల్లుతు, దోమల ఉత్పత్తికి నిలయాలుగా మారాయి. చెరువు, కాలువల సమీపంలో నివాసం ఉంటున్న కాలనీవాసుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. మురుగు నీటి వాసనతో పాటు దోమల కాటుకు ప్రతి క్షణం అల్లాడి పోతున్నారు. అనేక వ్యాధులకు గురవుతున్నారు. ఒకప్పుడు మంచినీరు ఉన్న చెరువుల్లో నేడు మురుగునీరు చేరి నీరు నల్లగా మారిపోయాయి. భవిష్యత్‌లో ఈ చెరువులన్నీ హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్‌లా మారే ప్రమాదంలో ఉందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులను కాలుష్యం నుంచి కాపాడాల్సిన బాధ్యత అధికారులు, పాలకులపై ఉంది. దీంతో పాటు పట్టణ ప్రజలు కూడా చెరువుల రక్షణ కోసం తమవంతు కృషి చేయాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

చేతులెత్తేసిన మున్సిపల్ శాఖ

పట్టణంలో సర్వే నెంబరు 475ఎలో 129.80 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నా సురప్పకుంటలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నీటిపారుదల శాఖ నుంచి 2015వ సంవత్సరంలో మున్సిపల్ శాఖకు అప్పగించింది. అయితే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం ఏర్పాటు చేయకుండా మున్సిపల్ శాఖ చేతులెత్తేసింది. అటవీశాఖలో నిధులు పుష్కలంగా ఉన్నాయని,రూ.5కోట్లతో బోటింగ్, ఉద్యానవనంతో పాటు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని అటవీశాఖకు అప్పగించారు. పనులను వెంటనే ప్రారంభిస్తున్నామని అప్పటి, ఇప్పటి ఎమ్మెల్యే బాలకృష్ణ చెరువులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పనులకు సంబందించి శంకుస్థాపన శిలఫలకాన్ని ఆవిష్కరించారు. అయితే ఆ పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ఇంతకి సురప్పకుంట ఎవరి ఆధీనంలో ఉందో సైతం అర్థం కావడం లేదు. సురప్పకుంట చెరువును పూర్తి స్థాయిలో పట్టణ ప్రజల అవసరాల కోసం ఎస్ఎస్ ట్యాంక్‌గా మారిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు చెప్తున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం



మురుగు నీరు శుభ్రం చేయడానికి ఎస్‌టిపి ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాం. అమృత్ పథకం కింద రూ.79కోట్లు కోట్లు మంజూరు దశలో ఉన్నాయి. ఈ పనులను ప్రజారోగ్యశాఖ వారికి అప్పగించారు. త్వరలో ఎస్‌టిపి ప్లాంట్‌లను ఏర్పాటు చేసి మురుగు నీటిని శుభ్రం చేసి చెరువుల్లోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటాం.

ప్రమోద్ కుమార్,
మున్సిపల్ కమిషనర్, హిందూపురం

నోటీసులు ఇచ్చాం



పట్టణ పరిధిలో ఉన్న సురప్పకుంట, పెన్నా కుమద్వతి ప్రాజెక్టు నీటిపారుదల కాలువలను ఎటువంటి అనుమతులు లేకుండా మురుగు కాలవలుగా మార్చారు. ఈ విషయంలో పలు మార్లు నోటీసులు ఇచ్చాం. అయినప్పటికి వారిలో కనీస స్పందన కనిపించలేదు. ఈ విషయాన్ని పై అధికారులకు వివరించాం. వారు కూడా నోటీసులు ఇచ్చారు.

యోగానంద,
డిఇ, నీటిపారుదల శాఖ

మిత్ర సమ్మిత విమర్శకుడు 'రాచపాలెం'

విమల స్మారక సాహిత్య జీవిత సాఫల్య పురస్కారప్రదానోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి - అనంతపురం

యువత సవరించుకోవడానికి వీలుగా ఉండే విమర్శ రాసే మిత్ర సమ్మిత విమర్శకుడు రాచపాలెం అని వక్తలు కొనియాడారు. విమల శాంతి సాహిత్య సాంస్కృతిక సేవాసమితి, శ్రీ సాయిబాబా నేషనల్ డిగ్రీ కళాశాల సంయుక్త నిర్వహణలో ఆదివారం స్థానిక శ్రీ సాయిబాబా నేషనల్ డిగ్రీ కళాశాలలో విమలస్మారక సాహిత్య జీవిత సాఫల్య పురస్కార ప్రధాన సభను నిర్వహించారు. ప్రముఖ కవి తూముచెర్ల రాజారాం అధ్యక్షత వహించిన ఈ సభకు గుర్రం జాషువా కళా పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ మంత్రి శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మంచి భవిష్యత్తును చూడాలనే తపన కలిగిన గొప్ప సౌజన్యశీలి, నిబద్ధ విమర్శకుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి అని అన్నారు. లివింగ్ లెజెండరీ రాచపాలెం ప్రస్తుత తెలుగు సాహిత్య ప్రక్రియలో సునిశిత పరిశీలన తో విమర్శ చేసే గొప్ప దార్శనిక వ్యక్తి అని కొనియాడారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ రచయిత ఎదగడానికి తగ్గట్టు గొప్ప విమర్శ చేసే రాచపాలెం ఎందరికో ఆదర్శమన్నారు. ఎస్ఎస్‌బిఎన్ కళాశాల కార్యదర్శి డాక్టర్ కె నిర్మలమ్మ మాట్లాడుతూ రాచపాలెం సాహిత్యం, జీవితం రెండు గొప్పవే అన్నారు. ఆయన ఏదైతే చెబుతాడో దానినే పాటిస్తాడన్నారు. డాక్టర్ శాంతి నారాయణ కుమార్తె శాంతి మంజుల రమేష్ బాబు కుటుంబ సభ్యులు కలిసి ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డిని, ఆయన సతీమణి రాచపాలెం లక్ష్మీ కాంతమ్మను ఘనంగా సన్మానించారు. విమల స్మారక సాహిత్య జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించారు. 30 వేల రూపాయల నగదు, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపేల్ డాక్టర్ రాజు, చిత్రావతి కథల రచయిత ఉప్పరపాటి వెంకటేశులు, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నానీల నాగేంద్ర, బండి యోగి, ఏలూరు యంగన్న, ఆర్ శశికళ, తరిమెల అమర్నాథ్ రెడ్డి, జి. అశ్వర్థరెడ్డి, దాసరి ఆదినారాయణ, సౌరపు గోవిందరాజులు, కంబదూర్ షేక్ నబి రసూల్, కొత్తపల్లి సురేష్, ఆనంద్, పూజారి ఈరన్న, డి గోవిందరాజులు, బాలకొండ ఆంజనేయులు, చామలూరు రాజగోపాల్, అంకె మదన్‌మోహన్, అప్పి రెడ్డి హరినాథ్ రెడ్డి డాక్టర్ అంకె శ్రీనివాస్, చిలుకూరి దీవెన నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ డివిజనల్ మేనేజర్ ఓబులపతి డి, కృష్ణమూర్తి, అనంత జాషువా హెచ్. నాగలింగయ్య, ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ ఎన్. రంగస్వామి, వన్నప్ప, గోసల నారాయణస్వామి, వై సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు

చంద్రబాబు అరెస్టు అన్యాయం

అనంతపురం : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా ఆదివానం నగరంలోని శారదానగర్‌లో టిడిపి నాయకులు పర్యటించారు. ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ చంద్రబాబు అక్రమ అరెస్టును వివరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి మార్కెట్ మహేష్, మాజీ కార్పొరేటర్ ఉమామహేశ్వర్, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, బూత్ ఇన్‌ఛార్జిలు బోయ వెంకటరమణ, బాలాజీ, మల్లికార్జుననాయుడు, కటిక మహేష్, సున్నం శ్రీనివాసులు, నాయకులు నారాయణస్వామియాదవ్, పోతుల లక్ష్మీనరసింహులు, గోపాల్‌గౌడ్, జయం బాషా, బోయపాటి బాలప్ప, గోళ్ల సుధాకర్‌నాయుడు, ఎస్సీ సెల్ నాయకులు వెంకటేష్, రామాంజి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సహకరిస్తే 'భూహక్కు భూరక్ష' రీ సర్వే సులభతరం

సర్వే ల్యాండ్స్ అండ్ రికార్డు జిల్లా అధికారి జిపి. రామక్రిష్ణ

జిపి. రామక్రిష్ణ

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

ప్రజలు సహకరిస్తే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూహక్కు, భూరక్ష పథకం క్రింద రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రీ సర్వే సులభతరం అవుతుందని సత్యసాయి జిల్లా సర్వే ల్యాండ్స్ అండ్ రికార్డు జిల్లా అధికారి జిపి. రామక్రిష్ణ తెలిపారు. భూతగాదాలు, రహదారులు, సాగుపట్టాలు, భూ ఆక్రమణలు తదితర అంశాలపై ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని మండల అధికారులనుండి, డివిజన్, జిల్లాస్థాయి అధికారులు చుట్టూ తిరుగుతూ ఉండడం మనం చూస్తూనే ఉంటాం. కొన్ని భూ సమస్యలు కలహాలు, హత్యలు, వరకు వెళ్ళిన సందర్భాలు ఉన్నాయి. కుటుంబంలోనే ఇద్దరి అన్నదమ్ముల మధ్య భూతగాదాలు నెలకొంటున్నాయి. భూసమస్యలపై గొడవలు జరగడం ఇరు వర్గాలు పోలీసులను ఆశ్రయించడం చూస్తూనే ఉన్నాం. ఇలాంటి భూ సమస్యలు ఉన్న వారందరికీ రీ సర్వే వల్ల పరిష్కారం లభిస్తుందని సర్వే ల్యాండ్స్ అండ్ రికార్డు జిల్లా అధికారి రామక్రిష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న:- రీ సర్వే వల్ల భూ సమస్యలు పరిష్కారమవుతాయని భావిస్తున్నారా?

జవాబు: ప్రజలు సహకరిస్తే భూ సమస్యలు పరిష్కారం అవుతాయి. వందల సంవత్సరాల తర్వాత భూహక్కు, భూ రక్ష పథకం కింద సర్వే చేస్తున్నాం. ప్రభుత్వం సర్వే రాళ్లను సైతం సమీకరించుకుంది. రీ సర్వేతో శాశ్వత భూహక్కు కలుగుతుంది. సర్వే కోసం డ్రోన్లు, విమానాలు సైతం వినియోగిస్తున్నాం. ప్రభుత్వం ఈ కార్యక్రమం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. ప్రజలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా భూహక్కు కల్పిస్తున్నాం. సర్వేకోసం గ్రామానికి వచ్చిన సిబ్బందికి తమకున్న భూమి పట్టాలు, పట్టాపాసుపుస్తకాలను అందజేస్తే సులభంగా సర్వే చేపట్టడానికి అవకాశం ఉంటుంది.

ప్ర: రీ సర్వేలో ఎలాంటి నమస్యలు ఎదురవుతున్నాయి ?

జ: సహజంగానే గ్రామాలలో భూసమస్యలు ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయి. ఉదాహరణకు ఒక కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు ఉండగా ఒకరు 10 సెంట్లు ఎక్కువ సాగుచేస్తుంటాడు. అప్పుడు ఇద్దరు అంగీకారానికి వస్తే సమస్య పరిష్కారం సులభతరం అవుతుంది. అలాగే కొన్ని భూ అక్రమాలు అన్యాక్రాంతమైన భూము లు ఉంటాయి. కొన్నికోర్టు పరిధిలో ఉంటాయి. అవన్నీ రీసర్వే లో బయటపడే అవకాశం ఉంది. వాటిని పరిష్కరించడానికి ప్రతి మండలానికి ఒక తహశీల్దారును ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించింది.

ప్ర: జిల్లా లో ఎంత సాగు భూమి ఉంది? ఎన్ని గ్రామాలు ఉన్నాయి?

జ: జిల్లాలో సుమారు 2 లక్షల ఎకరాల భూమి ఉంది. 460 గ్రామాలు ఉన్నాయి. ఇప్పటివరకు రీసర్వే కోసం మొదటి ఫేస్‌లో 26 గ్రామాల్లో, రెండవ ఫేస్‌లో 29 గ్రామాల్లో దశలవారీగా రీ సర్వే జరుపుతున్నాం. ఆయా గ్రామ రైతులకు భూమి యొక్క ధ్రువపత్రాలు మేరకు సర్వే పూర్తి చేసి రైతులకు ధ్రువపత్రాలను అందిస్తాం.

ప్ర: జిల్లాలో ఎప్పుడు సర్వే ప్రారంభించారు?

జ: ఒక ఏడాది నుంచి సర్వే పనులు చేపట్టాం. జిల్లాలో అన్ని గ్రామాల్లో సర్వే పూర్తి కావాలంటే మరో ఐదు సంవత్సరాలు పట్టవచ్చు. అసైన్డ్, బంజర భూములు, ప్రభుత్వ భూములు, రైతుల పట్టా భూములు రీసర్వే చేపట్టాం. ఇలా పలురకాల భూము లు ఉన్నాయి. గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి రీ సర్వే యొక్క ఉద్దేశాలను ప్రజలకు వివరించాం. కోర్టు పరిధిలో ఉన్న భూములు, రైతుల దగ్గర ఉన్న ఆధారాలు మేరకు సర్వే పూర్తి చేస్తాం.

ప్ర: సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జ: అలాంటి సమస్య ఏమీ లేదు. రీ సర్వేపై నెలలో రెండుసార్లు కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తున్నారు. అవసరమైన సిబ్బందిని ప్రభుత్వం సమకూరుస్తుంది. వాస్తవంగా చెప్పాలంటే ఇదొక బృహత్తర కార్యక్రమం. ఆయా గ్రామాల్లో సర్వేకు ప్రజలు అధికారులకు సహకరిస్తూ రీసర్వే సులభతరం అవుతుంది.

ప్రజాశక్తి వార్తకు స్పందన

నార్పల వీధుల్లో స్ప్రేయింగ్

నార్పలలో స్ప్రేయింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికుడు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని పలు వీధుల్లో పంచాయతీ అధికారులు స్ప్రేయింగ్ చేయించారు. నార్పల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో 'విజృంభించిన విషజ్వరాలు' అని ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఇందులో భాగంగా సర్పంచి మంజుల సుప్రియ, కార్యదర్శి అశ్వర్థనాయుడు స్వయంగా దగ్గరుండి ఆదివారం స్ప్రేయింగ్ చేయించారు. మండల కేంద్రంలోని ఉయ్యాలకుంటవీధి, జంగాల కాలనీ, పాత ఆసుపత్రి వీధి, బాలనాగి వీధి, ఆంజనేయస్వామి గుడి వీధుల్లో పంచాయతీ కార్మికులతో స్ప్రేయింగ్ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ ప్రస్తుతం స్ప్రేయింగ్ చేశామని, త్వరలోనే ఫాగింగ్ మిషన్లు వస్తాయని అవి వచ్చిన వెంటనే రాత్రి సమయంలో ఫాగింగ్ చేయిస్తామని తెలిపారు.

కొమురం భీమ్‌కు నివాళి

కొమురం భీమ్‌కు నివాళులర్పిస్తున్న సిఐ,ఎస్ఐ, ఎస్సీ, ఎస్టీ ఐద్య వేదిక నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

తెలంగాణ విముక్తి కోసం పోరాడిన కొమురం భీమ్ జయంతిని పురస్కరించుకుని ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం నివాళులర్పించారు. ఇందులో భాగంగా సిఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ వెంకటస్వామి, తదితరులు కొమురం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కోసి చేసి సంబరాలు చేసుకున్నారు. తర్వాత ప్రభుత్వాసుపత్రిలో రోగులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కొమరం భీమ్ గిరిజన ఉద్యమ నాయకుడుగా తెలంగాణ విముక్తి కోసం పోరాడిన గొప్ప వీరుడని కొనియాడారు. కొమరం భీమ్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకుని మంచి మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేయూత ఫౌండేషన్ డైరెక్టర్ మధు ప్రసాద్, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, చాబాల సర్పంచి జగదీష్, బీఎస్పీ ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మండ్ల ప్రభాకర్, బిఎస్పీ మండల అధ్యక్షులు రాము, ఎస్సీ జన సంఘం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడిసెల రాజేష్, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక మండల అధ్యక్షులు మీనుగా రామాంజనేయులు, ఎఐఎస్ఎఫ్ నాయకులు చిరు, ఆర్ఎస్‌యూ నాయకులు భీమేష్, ఎంఆర్‌పిఎస్ జిల్లా కో కన్వీనర్ గణేష్, ఎంవిఎంఎస్ సురేంద్ర, దళిత సంఘాల నాయకులు ఇంద్రావతి గంగాధర్, నవీన్, యశ్వంత్, కార్తీక్, వీరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రాజారెడ్డిపై దాడి అమానుషం

జనసేన జిల్లా కార్యదర్శి గౌతమ్‌కుమార్

విలేకరుతో మాట్లాడుతున్న జనసేన జిల్లా కార్యదర్శి గౌతమ్‌కుమార్

ప్రజాశక్తి-ఉరవకొండ

ధర్మవరంలో జనసేన నాయకులు రాజారెడ్డిపై చేసిన దాడి అమానుషమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గౌతంకుమార్ తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఉరవకొండలోని జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక ఓటమి భయంతో జనసేన నాయకులపై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. తమ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ స్ఫూర్తిని అణువణువున నింపుకున్న జనసేన నాయకులు, కార్యకర్తలు దాడులు చేయిస్తే భయపడరన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మీ భరతం పడతామని హెచ్చరించారు. ముఖ్యంగా ధర్మవరంలో ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి ఆగడాలు రోజురోజుకు శృతి మించిపోతున్నాయన్నారు. ఫ్యాక్షన్ రాజకీయాలు చేయాలన్న విధంగా వ్యవహరిస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హితవు పలికారు. సిసి ఫుటేజీలో దాడి చేసిన వారు స్పష్టంగా కనబడుతున్నా ఇంత వరకూ పోలీస్ యంత్రాంగం ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. వైసిపి ఎన్ని కుట్రలు, కుయుక్తులు, దాడులు చేసిన జనసేన నాయకులు, కార్యకర్తలు వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ, వజ్రకరూరు మండలాల అధ్యక్షులు చంద్రశేఖర్, కేశవ్, దేవేంద్ర, ఉపాధ్యక్షుడు రాజేష్, నాయకులు రమేష్, మల్లికార్జున, బోగేస్, మణికుమార్, బోపేష్, చందు, తదితరులు పాల్గొన్నారు.

పొట్టిపాడు ఎండియు ఆపరేటర్ పై చర్యలు తీసుకోవాలి

ఆందోళన వ్యక్తం చేస్తున్న పొట్టిపాడు ఎస్సీ కాలనీవాసులు

ప్రజాశక్తి-ఉరవకొండ

వజ్రకరూరు మండల పరిధిలోని పొట్టిపాడు గ్రామంలో చౌకధాన్యం సక్రమంగా సరఫరా చేయని ఎండియు ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీవాసులు కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ల వద్దకే వచ్చి బియ్యం సరఫరా చేయాల్సి ఉంది. అయితే తమ కాలనీలో ఎండియు ఆపరేటర్ సక్రమంగా పంపిణీ చేయడం లేదని వాపోతున్నారు. ఈ విషయమై కాలనీవాసులు సచివాలయంలో వీఆర్వో, పంచాయతీ సెక్రటరీతోపాటు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎండియు ఆపరేటర్ కాలనీలోకి రాకుండా ప్రజలు కూలి పనులకు వెళ్లినప్పుడు గ్రామంలో ఎక్కడో ఒకచోట ఏర్పాటు చేసుకుని బియ్యం ఇస్తున్నారన్నారు. అక్కడికి వస్తేనే బియ్యం వేస్తానని, కాలనీలోకి వచ్చేది లేదని తెగేసి చెబుతున్నాడని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎండియు ఆపరేటర్‌పై చర్యలు తీసుకుని సకాలంలో ఎస్సీ కాలనీకి వచ్చి రేషన్ బియ్యం మంజూరయ్యేలా చూడాలని కోరుతున్నారు.

బళ్లారి బైపాస్ మీదుగా రైళ్ల కొనసాగింపు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం మీదుగా ప్రయాణించే యశ్వంతపూర్-కారటిగి ఎక్ప్రెస్ 16545/16546, మైసూరు సాయినగర్ షిరిడీ ఎక్స్‌ప్రెస్ 16217/16218 రైళ్లను బళ్లారి రైల్వే జంక్షన్‌లో కాకుండా బళ్లారి బైపాస్ మీదుగా మరో మూడు నెలల పాటు నడపనున్నట్లు నైరుతి రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమృత్ స్టేషన్ అభివృద్ధిలో భాగంగా బళ్లారి రైల్వేస్టేషన్ 2వ నంబర్ ప్లాట్‌ఫారంలో మరమ్మతులు కొనసాగుతున్నందున గతంలో ఈనెల 23వ తేదీ వరకూ రైళ్లను బళ్లారి రైల్వేస్టేషన్‌లో ఆపేవారు కాదు. అయితే మరమ్మతులు, అభివృద్ధి పనులు ఇంకా జరగాల్సి ఉన్నందున కారటిగి-యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్, మైసూరు సాయినగర్ షిరిడీ ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చే ఏడాది జనవరి 31వ తేదీ వరకు బళ్లారి రైల్వే స్టేషన్ జంక్షన్‌లో ఆపరన్నారు. ఈ రైలు బళ్లారి బైపాస్ మీదుగా ముందుకు వెళ్తుందని రైల్వే అధికారులు తెలిపారు. కాగా బళ్లారి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల కారణంగా గుంతకల్లు-చిక్కజాజురు రైలు ఈనెల మూడవ తేదీ నుండి ఈనెల 20వ తేదీ వరకూ నిలిపి వేయనున్నట్లు తెలిపారు. శనివారం నుంచి ఈ రైలు యథావిధిగా నడపనున్నట్లు రైల్వేస్టేషన్ మాస్టర్ ఉమామహేష్ తెలిపారు.

పూర్వ విద్యార్థులు అపూర్వకలయిక

ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు

నార్పల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 2002-2003లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలిశారు. ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డ వారంతా బడి ప్రాంగణంలో అడుగు పెడుతూనే హోదాలను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆనాటి గురువులను ఘనంగా సత్కరించి పాదపూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, అబ్బా టీవీ డైరెక్టర్ డాక్టర్ హరిప్రసాద్, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఏ పని కావాలన్నా..

చేయి తడపాల్సిందే..

సచివాలయాల్లో పెచ్చుమీరుతున్న అవినీతి
పట్టించుకోని అధికారులు
ఆందోళనలో ప్రజలు

సచివాలయాల్లో అవినీతిపై ఎంపిడిఒ వెంకటనాయుడుకు ఫిర్యాదు చేస్తున్న ఆర్‌టిఐ అధ్యక్షులు శ్రీనివాసులు, కార్యదర్శి కె.ఈరన్న

ప్రజాశక్తి-కుందుర్పి

సచివాలయాల ద్వారా అవినీతి రహిత పాలనను అందించాలన్న సిఎం జగన్ ఆశయం నీరుగారుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లోని సచివాలయాల్లో పనిచేస్తున్న అధికారులకు చేతివాటం ప్రదర్శిస్తూ నిరుపేదల కడుపు కొడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. బర్త్, డెత్ సర్టిఫికెట్ల కోసం డిజిటల్ అసిస్టెంట్లు రెవెన్యూ ఆన్‌లైన్‌లోని చేర్చాలంటే ప్రభుత్వ నిబంధన మేరకు కేవలం రూ.50 తీసుకోవాలి. అయితే ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.200 నుంచి రూ.300 దాకా అదనంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. డబ్బులు ఇవ్వకపోతే వివిధ కారణాలు చెబుతూ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని బాధితులు వాపోతున్నారు. ఇకపోతే ఆధార్ కేంద్రాన్ని కూడా డిజిటల్ అసిస్టెంట్లుకు అప్పజెప్పడంతో అందినకాడికి డబ్బులు దండుకుంటున్నారని ప్రజలు బహిరంగంగా చెబుతున్నారు. అలాగే కొంతమంది గ్రామీణ సచివాలయ సర్వేయర్లు సైతం చిన్న రైతుకు పని చేయాలంటే చెయ్యి తడపాల్సిందే. మామూళ్లు ఇవ్వకపోతే సర్వేయర్లు పని చేయడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అప్పిలేపల్లి గ్రామ సచివాలయంలో పని చేస్తున్న సచివాలయ సర్వేయర్ మామూళ్లు ఇప్పించుకుంటున్నాడని ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు బాబు ఆరోపించడం విశేషం. అలాగే కొంతమంది వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు సైతం పంట పెట్టినా, పెట్టుకోకపోయినా పర్వాలేదు.. చేయి తడిపితే పంట నమోదు చేసి నగదు వారి ఖాతాలకు జమ చేస్తున్నారని బండమీదపల్లి వాసులు ఈరలింగ, వన్నూరప్ప, నాగేంద్రప్ప, మంజునాథ వాపోయారు.

ఇవన్నీ ఒక ఎత్తయితే సమయపాలన పాటించకపోవడం మరో ఎత్తు. ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు వస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇదేమని అడిగితే వారిది ఏ పని అయినా ఆలస్యం చేయడం రివాజుగా మారుతున్నట్లు సమాచారం. ఈ విషయమై ఎంపిడిఒ వెంకటనాయుడు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు ఎన్.వెంకటంపల్లి మంజునాథ్ పాత్రికేయుల వద్ద వాపోయాడు. అంతేగాకుండా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని దురుసుగా కూడా ప్రవర్తిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేకపోవడం వల్లే సచివాలయాల్లో అవినీతి పెచ్చుమీరిపోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ అధికారులు సయమ పాలన పాటించడంతోపాటు అవినీతికి పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యువత దేశభక్తి కలిగి ఉండాలి

కుండల్లో మట్టి పోస్తున్న విద్యార్థులు, రూడ్‌సెట్ సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం

యువత దేశభక్తిని అలవర్చుకోవాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా అవసరమని నెహ్రూ యువ కేంద్రం ప్రోగ్రాం ఇన్‌ఛార్జి జి.శ్రీనివాసులు, రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. అనంతరం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రూడ్‌సెట్ సంస్థ మీటింగ్ హాల్‌లో 'మేరీ మట్టి మేరా దేశ్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సర్ధార్‌వల్లబాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ యువతలో దేశభక్తిని పెంపొందించేందుకే కేంద్ర ప్రభుత్వం నా మట్టి నా దేశం కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దేశ సేవకు అంకితం కావాలన్నారు. ఐక్యరాజ్య సమితి అవార్డు గ్రహీత బిసాటి భరత్ మాట్లాడుతూ ప్రతి యువత వారి జీవితంలో సినిమా హీరోలను కాకుండా అనునిత్యం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశం కోసం దేశ సరిహద్దులో మనకు రక్షణగా ఉంటూకాపాడుతున్న సైనికులను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి జీవన్ కుమార్, శిక్షకులు ఉషా, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కె.జయమారుతి, సభ్యులు తుకారామ్‌నాయక్, శ్రీకాంత్, సంతోష్‌నాయక్, భరత్‌సాయి, మహిళలు, యువతులు పాల్గొన్నారు.

జగనన్ననే మళ్లీ గెలిపించుకుందాం..

విప్ కాపు రామచంద్రారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

ముఖ్యమంత్రిగా తిరిగి వైఎస్ జగన్‌ను గెలిపించుకునేందుకు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా కృషి చేయాలని విప్ కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రాయదుర్గం మండలం 74 ఉడేగోళం మద్దనేశ్వరస్వామి ఆలయ ఆవరణలో వైసిపి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సిఎం జగన్ ఇచ్చిన వాగ్దానాలను 99 శాతం అమలు చేశారన్నారు. దీంతో తిరిగి జగనే సీఎం కావాలన్నారు. అందుకు కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని, ప్రభుత్వ పథకాలను వివరించాలన్నారు. ఇకపోతే తాను ఏ త్యాగాలనూ ఆశించడం లేదని, నిజాయితీగా, కష్టపడి తిరిగి వైసిపి ప్రభుత్వం ఏర్పడితే ప్రజలకు జరుగుతుందని ఆశిస్తున్నానన్నారు. ఇందులో తనకు ఎలాంటి స్వార్థం లేదన్నారు. ప్రస్తుత తరుణంలో ఎన్నికలంటే డబ్బు అన్నారు. అయితే కేవలం డబ్బు ఉన్నంత మాత్రాన ఎన్నికల్లో విజయం సాధించలేమన్నారు. వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మాధవరెడ్డి మాట్లాడుతూ తమ పార్టీ ఈనెల 25వ తేదీ నుంచి చేపట్టనున్న బస్సుయాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పొరాల శిల్ప, మాజీ అధ్యక్షులు గౌని ఉపేంద్రరెడ్డి, వైసిపి మండల కన్వీనర్, జడ్పిటిసి మల్లికార్జున, పట్టణ అధ్యక్షుడు ఆరవ శివప్ప, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్‌తోనే వైసిపి పతనం

జనసేన జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్

పార్టీలోకి చేరిన వారితో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజా కంఠక ముఖ్యమంత్రిగా పేరుపొందిన సిఎం జగన్ నాయకత్వం లోని వైసిపి ప్రభుత్వం జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ చేతిలో పతనం కాక తప్పదని ఆపార్టీ జిల్లా అధ్యక్షులు టి.సి.వరుణ్ అన్నారు. పవన్‌కళ్యాణ్ ఆశయాలకు ఆకర్షితులై నగర సహాయ కార్యదర్శి ఆకుల అశోక్ ఆధ్వర్యంలో రుద్రంపేట పంచాయితీలో నగర అధ్యక్షులు పొదిలి బాబురావు సభ అధ్యక్షతన సోమసుందరి, అనురాధతోపాటుగా మహిళలు, యువకులు ఆదివారము జనసేన పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో పనిచేసే ప్రతి ఒక్కరికీ సరైన సమయంలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు జనసేన, టిడిపి కలిసి పనిచేయాలని సూచించారు. స్థానికంగా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యక్రమాల కమిటీ ప్రధాన కార్యదర్శి భవానీ రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు జయరామ్‌రెడ్డి, అంకే ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్, కార్యదర్శులు రాపా ధనుంజయ్, సంజీవరాయుడు, కిరణ్‌కుమార్, జయమ్మ, అవుకు విజయకుమార్, నగర ఉపాధ్యక్షులు సదానందం, గ్రంధి దివాకర్, జక్కిరెడ్డి ఆదినారాయణ, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, వెంకటనారాయణ, హుస్సేన్, దరాజ్‌బాషా, కార్యదర్శులు అంజి, శేషాద్రి, వడ్డే వెంకటేష్, వెంకటరమణ, ఆకుల ప్రసాద్ కార్యక్రమాల కమిటీ సభ్యులు సంతోష్, వీరమహిళలు అనసూయ, దాసరి సరిత, మంజుల, నాయకులు చిరు, హరీష్ (రుద్రంపేట), చాందూ, నవీన్, నజీమ్, హిద్దు, విజయ్ దేవరయల్, నౌషాద్, తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

రాయదుర్గం రూరల్ : డి.హీరేహాల్ మండలం తమ్మేపల్లి గ్రామంలో మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన కోసం రాయదుర్గం నియోజకవర్గ వాల్మీకి సంఘం అధ్యక్షుడు బండి కిష్టప్ప ఆదివారం రూ.10,116 విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సేవా సమితి కార్యదర్శి ఎన్.టి.సిద్ధప్ప, ఉపాధ్యక్షుడు మలకన్న, కోశాధికారి బండి చంద్రశేఖర్, ఉప కోశాధికారి రఘు, సేవాసమితి సభ్యులు సిద్ధలింగప్ప, తిప్పేస్వామి, సత్తి, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో ఆయుధపూజ

గుత్తిలో ఆయుధ పూజ చేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ వన్నూరుబీ

గుత్తి : పురపాలక సంఘ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ ఆదివారం ఆయుధ పూజ నిర్వహించారు. ముందుగా కార్యాలయం వద్ద ఉన్న వాహనాలకు పూజలు చేశారు. అనంతరం పాత మున్సిపల్ కార్యాలయ భవనం వద్ద తాగునీటిని సరఫరా చేసే మోటార్లకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ డిఇఇ రఘు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రంగయ్య, మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

పుట్లూరు : దసరా పండగను పురస్కరించుకుని ఆదివారం ఆయుధ పూజ చేశారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎస్ఐ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో వేద పండితులతో ఆయుధ పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ హనుమంతు, పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తి : మండలంలోని బసినేపల్లి గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. బసినేపల్లి గ్రామానికి చెందిన కృష్ణమూర్తి, సరస్వతి, సూర్యప్రకాష్ వ్యవసాయ పనులకు ఎద్దులబండిలో బయలుదేరారు. రహదారిపై వెళ్తున్న ఎద్దుల బండిని వెనకవైపున లారీ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ముగ్గురిని స్థానికులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కృష్ణమూర్తిని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మద్యం మత్తులో సెలూన్‌షాప్ ధ్వంసం

గుత్తి : పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న ఓ సెలూన్ షాపును శంకర్ అనే వ్యక్తి మద్యం మత్తులో ధ్వంసం చేశాడు. నాయీ బ్రాహ్మణుడు సంజీవ్ సెలూన్ షాపు పెట్టుకుని జీవన కొనసాగించేవాడు. ఆదివారం షాప్‌నకు తాళాలు వేసి ఇంటికి వెళ్లిపోయాడు. అయితే మద్యం తాగిన శంకర్ తలుపు తాళాలను తొలగించి అందులోని అద్దాలు, కుర్చీలను ధ్వంసం చేశాడు. గమనించిన బాధితుడు నాయీబ్రాహ్మణ సంఘం నాయకులను ఆశ్రయించాడు. దీంతో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకుడు పి.సునీల్ కుమార్ తదితర నాయకులతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. శంకర్ గతంలో కూడా సెలూన్ షాపుపై దాడులు చేశాడని అతని ఆగడాలను అరికట్టాలని పోలీసులకు విన్నవించుకున్నారు.

ధైర్యలక్ష్మి అలంకారంలో అమ్మవారు

పూజలందుకున్న అమ్మవారు

ఉరవకొండ : దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పెన్నఅహోబిలంలో స్వయంభువుగా వెలసిన ఉద్భవ లక్ష్మీదేవి అమ్మవారు ఆదివారం ధైర్యలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు బాలాజీ స్వామి అమ్మవారి మూలవిరాట్‌ను ధైర్యలక్ష్మీ దేవి రూపంలో అలంకరించారు. తర్వాత మూలవిరాట్‌కు తిరుమంజన అభిషేకం, చక్రార్చన, మహా మంగలహారతి తదితర పూజలు శాస్త్రోక్తంగా చేశారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

అన్నదానం చేస్తున్న దృశ్యం

రాయదుర్గం : పట్టణంలోని నగరేశ్వర వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, నానావిధ ద్రవ్యాభిషేకం, సామూహిక కుంకుమార్చన, మహా మంగళహారతి వంటి కార్యక్రమ్మఆలను నిర్వహించారు. సాయంకాలం అమ్మవారు దుర్గదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే ఓబుళాచారి రోడ్డు వద్ద ఉన్న బన్ని మహంకాళి ఆలయంలో ఆదివారం అన్నదానం చేశారు.

పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ

నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

అనంతపురం : దుర్గాష్టమి పండుగ సందర్భంగా పేదలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తూ నిత్య సురభి ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత నిర్మల, ఆదిత్య కన్‌స్ట్రక్షన్స్ అధినేత మురళి కుటుంబ సమేతంగా ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్మల మురళి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దసరా పండుగను సంతోషంగా చేసుకోవాలని సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆదర్శనగర్‌లోని ఆశ్రమం వద్ద 21 మంది పేద కుటుంబాలకు రూ.21 వేల ఖర్చుతో 21 రకాల వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు వరలక్ష్మి, భానుప్రకాష్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన 'రైతు దేవుళ్లకు అన్న ప్రసాదం'

రైతులకు అన్నం ప్యాకెట్లను అందజేస్తున్న పోలీసులు, జైకిసాన్ సభ్యులు

ఉరవకొండ : జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు రైతు దేవుళ్లకు అన్న ప్రసాదం కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని పాల్తూరు పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ దేవరాజ్ అన్నారు. 4వరోజు ఆదివారం విడపనకల్ మండల పరిధిలోని ఉండబండ, పాల్తూరు గ్రామాల్లోని పొలాల వద్దకు వెళ్లి రైతులకు ఆహార పొట్లాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సంపాదనలో కొంత మొత్తాన్ని వెచ్చించి పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. ముఖ్యంగా రైతు దేవుళ్లకు అన్న ప్రసాదం అందించడం మరింత గొప్ప కార్యమన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది, జైకిసాన్ ఫౌండేషన్ ప్రతినిధులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపుతాం

సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు వద్ద నీటి విడుదలను పరిశీలిస్తున్న నాయకులు

ఉరవకొండ : ఎండాకాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి సూచనల మేరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను వేగవంతంగా నింపడానికి కృషి చేస్తున్నామని వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ కాంట్రాక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. ఈమేరకు విడపనకల్ మండల కేంద్రంలో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు సరఫరా చేస్తున్న నీటిని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏడు అద్దె ట్రాక్టర్లను ఏర్పాటు చేసి రోజూ 24 గంటలు వాటి ద్వారా అదనపు నీటిని పంపింగ్ చేసే విధంగా పైప్‌లైన్లు అమర్చనున్నట్లు తెలిపారు. అతి త్వరలోనే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నింపి ప్రజలకు వేసవిలోఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విడపనకల్ ఎంపిపి కరణం పుషావతి భీమిరెడ్డి, నాయకులు అశోక్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులు అష్ఫాఖుల్లాఖాన్‌కు నివాళి

అనంతపురం : చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వాళ్లతో పోరాడిన అష్ఫాఖుల్లాఖాన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం నగరంలోని టిఎన్ఆర్ కాలనీలో ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. ఇందులో భాగంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముష్కిన్ మాట్లాడుతూ దేశంలో మతసామరస్యం కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి అష్ఫాఖుల్లాఖాన్ అన్నారు. ఆఖరికి ఉరి తీసేటప్పుడు తన చివరి కోరిక ఏమిటి అని బ్రిటిష్ ప్రభుత్వం అడిగితే నా మాతృదేశపు పిడికెడు మట్టి నన్ను చుట్టే తెల్లటి వస్త్రంలో పెట్టి దహన సంస్కారాలు చేయాలని కోరిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు వలి, సభ్యులు ఇస్మాయిల్, బాబ్జాన్, షరీఫ్, ఇలిషాద్, మంజు, తదితరులు పాల్గొన్నారు.